


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 09.02.2026 | సంపుటి : 3 | సంచిక :9 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Monday | 09.02.2026 | volume : 3 | Issue : 9 | Pages : 8 | Cost : 2/- |




02

## భారత్-మలేషియా బంధానికి తమిళమే వారధి: ప్రధాని మోదీ

భారత్, మలేషియాలను తమిళ భాష కలుపుతోందన్న ప్రధాని మోదీ

ఇరు దేశాల మధ్య ఆడియో విజువల్ ఒప్పందంపై హర్షం

మలేషియాలో 12,000 మందితో ప్రధాని మోదీ భారీ సభ

మలయా యూనివర్సిటీలో 'తిరువళ్లువర్ సెంటర్' ఏర్పాటుకు నిర్ణయం

మలేషియా ప్రధానికి ఎంజీఆర్ పాటలంటే ఇష్టమన్న మోదీ

భారత్, మలేషియా మధ్య సాంస్కృతిక సంబంధాలను తమిళ భాష బలంగా పెనవేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇరు దేశాల మధ్య తాజాగా కుదిరిన ఆడియో విజువల్ ఒప్పందం ద్వారా తమిళ చిత్రాలు, సంగీతం మన హృదయాలను మరింత దగ్గర చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కౌలాలంపూర్‌లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి ఆదివారం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

# జిల్లాలను రద్దు చేయం

## జిల్లాల పునర్విభజన చేయాల్సి వస్తే అసెంబ్లీలో చర్చిస్తాం

బీఆర్ఎస్ అంటే బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ను అరెస్ట్ చేసే వరకూ కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావే

సింగరేణిపై బీఆర్ఎస్ విష ప్రచారం.. మెడికల్ బోర్డు రద్దు ఆలోచన లేదు

ప్రజాపాలన-ప్రగతిబాట కార్యక్రమంలో సీఎం రేవంత్



02

జిల్లాలను తీసివేయం.. కొత్త జిల్లాలను ఏర్పాటు చేయం.. ఒకవేళ జిల్లాల పునర్విభజన చేయాల్సి వస్తే అసెంబ్లీలో చర్చకు పెడతాం. ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలను తీసుకుంటాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అబద్ధాలతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్న వారిని నమ్మొద్దని, భూపాలపల్లి జిల్లా ఎటూపోదని.. జిల్లాల మార్పులపై ఎవరూ అపోహ పడొద్దని చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆదివారం నిర్వహించిన ప్రజాపాలన--ప్రగతిబాట కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.

హెలికాప్టర్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖతో ముందుగా రేగొండ మండలం కొడవటంచ గ్రామానికి చేరుకున్న సీఎం.. శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అక్కడ రూ.63 కోట్లతో ఆలయ పునరుద్ధరణ, గెస్ట్‌హౌస్ నిర్మాణ పనులను సురేఖ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం చెల్పూరులో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన--ప్రగతి బాట'బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. జిల్లాల పునర్విభజనపై అందరి అభిప్రాయాలు తీసుకొని, అసెంబ్లీలో చర్చించిన తర్వాతే దీనిపైన ఆలోచిస్తామని, కుట్రలు, కుతంత్రాలతో విష ప్రచారం చేస్తున్న వారిని గమనించాలని పునరుద్ఘాటించారు. - వరంగల్



### ఓటుకు నోటు కేసులో
## సాక్ష్యాలు మాయం

ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రమాదం వెనుక సీఎం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ

వరంగల్ : ఓటుకు నోటు కేసులో సాక్ష్యాలు మాయం చేసేందుకే ఫోరెన్సిక్ ల్యాబ్ తగలబెట్టారని, దీని వెనుక సీఎం రేవంత్‌రెడ్డి హస్తం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. భారాస అభ్యర్థులకు మద్దతుగా ఆదివారం ఆయన వరంగల్, నర్సంపేటలలో

-మిగతా 2 లో..



2

## సిద్ధిపేట జిల్లాలో పెద్దపులి కలకలం

వరుసగా పశువులపై దాడులు!

తాజాగా ఐదు దూడలను చంపివేయడంతో భయాందోళనలు

పులిని పట్టుకునేందుకు అటవీ శాఖ ముమ్మర యత్నాలు

పొలాలకు ఒంటరిగా వెళ్లొద్దని ప్రజలకు హెచ్చరిక



2

### పదేళ్లు దోపిడీ చేసినందుకు
## ఓటు వేయాలా?

బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఇల్లు, స్థలం ఇవ్వలేదు

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

'మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు అడుగుతున్నారు.. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్నందుకు వారికి ఓట్లేయాలా. రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచినందుకు ఓట్లేయాలా'అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా వైరా, మధిర మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో భట్టి మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలన కాలంలో పేదలకు ఒక్క ఇల్లు కానీ, ఇంటి స్థలం కానీ ఇవ్వలేదని ఆరోపించారు.

### వీధి రౌడీలా
## రేవంత్ భాష

కాంగ్రెస్ పాలనలో అన్నీ స్కామ్‌లే

బీఆర్ఎస్ సర్కార్ తెచ్చిన స్కీములన్నీ బంద్ చేశారు

పట్టణాల రోడ్లన్నీ గుంతలమయం

సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



పట్టణాల్లో వీధిదీపాలను కూడా వెలిగించలేని మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. తన భాషతో వీధి రౌడీలా తయారయ్యారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పట్టణాల్లో రోడ్లన్నీ గుంతలమయంగా మారితే, రేవంత్‌రెడ్డి మాత్రం కండ్లకు గంతలు కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో పట్టణాల్లో దోమల నివారణకు ఫాగింగ్ జరగడం లేదని.. కేవలం ఫ్రాడింగ్ మాత్రమే చేస్తున్నారని ధ్వజమెత్తారు.

సంగారెడ్డి: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక స్కీములు బంద్ అయ్యాయని, స్కామ్‌లు మాత్రం జోరందుకున్నాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం

-మిగతా 2 లో..



నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹72

## పెద్ద ఎత్తున ఓట్లను కొనేందుకు కుట్ర

కాంగ్రెస్, ఎంఐఎం మధ్య రూ.100 కోట్ల డీల్

కరీంనగర్‌లో బీజేపీని ఓడించేందుకు ఈ రెండు పార్టీల మ్యాచ్ ఫిక్సింగ్..

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



కరీంనగర్: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్‌లో కబడ్డీ ఆట మొదలైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇండియా పేరుతో బీజేపీ, పాకిస్తాన్ పేరుతో కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కలిసి

-మిగతా 2 లో..

### యాసంగి రైతు భరోసా కోసం
## ప్రభుత్వ కసరత్తు

నిధుల కోసం బహిరంగ మార్కెట్ నుంచి రూ.9,000 కోట్ల రుణం

ఈ నెల 10న ఆర్బీఐ ద్వారా నిధుల సమీకరణకు ప్లాన్

మున్సిపల్ ఎన్నికల తర్వాతే నిధులు జమ చేస్తామన్న సీఎం రేవంత్



హైదరాబాద్ : తెలంగాణ రైతులకు యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను అందించేందుకు ప్రభుత్వం భారీ కసరత్తు ప్రారంభించింది. నిధుల సమీకరణ కోసం బహిరంగ మార్కెట్ నుంచి ఏకంగా రూ.9,000 కోట్లు రుణం తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్

-మిగతా 2 లో..



### భారత్-మలేషియా బంధానికి
## తమిళమే వారధి: ప్రధాని మోదీ

**కౌలాలంపూర్:** మలేషియా విద్య, మీడియా, సాంస్కృతిక జీవనంలో తమిళ భాషకు బలమైన, సజీవమైన ఉనికి ఉందని మోదీ ప్రశంసించారు. అంతకుముందు శనివారం జరిగిన 'సెలమత్ దతాంగ్ మోదీజీ' కార్యక్రమంలో 12,000 మందికి పైగా ప్రవాస భారతీయులు, స్నేహితులు పాల్గొన్నారు. ఈ సభకు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా హాజరయ్యారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ప్రవాస భారతీయ సమాజం మలేషియాలో ఉందని, ఇరు దేశాల ప్రజల హృదయాలను కలిపే అంశాలు చాలా ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంకు లెజెండరీ నటుడు ఎంజీఆర్ పాటలంటే ఎంతో ఇష్టమని మోదీ గుర్తుచేశారు. బటు కేవ్స్‌లో జరిగిన తైపూసం వేడుకలు, మలేషియాలో గర్బా నృత్యం ప్రాచుర్యం పొందడం మన సాంస్కృతిక బంధానికి నిదర్శనమని అన్నారు. తమిళం ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప బహుమతి అని, తమిళ సాహిత్యం శాశ్వతమైనదని కొనియాడారు. భారత ఉపరాష్ట్రపతి, విదేశాంగ, ఆర్థిక మంత్రులు తమిళనాడుకు చెందినవారేనని ఆయన సభలో ప్రస్తావించారు. ఈ చారిత్రక స్ఫూర్తితో, ఇప్పటికే ఉన్న తిరువళ్లువర్ చైర్‌కు అదనంగా మలయా యూనివర్సిటీలో 'తిరువళ్లువర్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

# జిల్లాలను రద్దు చేయం

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్‌ను అరెస్టు చేయకుండా అడ్డుపడుతున్నాడని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను అరెస్ట్ చేసే వరకు కిషన్‌రెడ్డిని కల్వకుంట్ల కిషన్‌రావనే పిలుస్తానని స్పష్టం చేశారు. రూ.వేల కోట్ల ఆస్తులను పేదలకు దానం చేసిన సోనియా, రాహుల్‌గాంధీని సీబీఐ, ఈడీ కేసుల పేరుతో వేధించి అమానించలేదా? గాంధీ కుటుంబంపైన ఈడీ, సీబీఐని ఉపయోగిస్తున్నప్పుడు కాళేశ్వరంపైన సీబీఐ విచారణకు పంపిస్తే ఎవరు అడ్డుకుంటున్నారు'అని ప్రశ్నించారు. ఫెవికాల్ బంధంతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును కిషన్‌రెడ్డి కంచె వేసి కాపాడుతున్నాడన్నారు. కేసీఆర్‌కు కేటీఆర్ సొంత కొడుకైతే.. కిషన్‌రెడ్డి దత్త పుత్రుడని చెప్పారు.

### ఏప్రిల్ తర్వాత రెండో విడత 'ఇందిరమ్మ'

ఏప్రిల్ తర్వాత రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 'ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం. రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం. వచ్చే బడ్జెట్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం'అని స్పష్టం చేశారు. 'కేసీఆర్, మోదీని చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్, బీజేపీ చెబుతున్నాయి. గల్లీలో మోరీలు కేసీఆర్ వచ్చి తీస్తాడా? కేసీఆర్, మోదీ బొమ్మలు చూపించి ఓట్లు అడగడానికే పనికి వస్తారు.. పెళ్లి పెద్దను చూసి పిల్లను ఇస్తే సంసారం ఆగం అవుతుంది'అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మీ సమస్యలు పరిష్కారం అవుతాయని, ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో బోర్లబొక్కల పడుకున్న కేసీఆర్ నిధులు ఇవ్వడని అన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు రూ.17,442 కోట్లు మంజూరు చేశామని స్పష్టం




చేశారు. 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా బాసర నుంచి భద్రాచలం వరకు పర్యాటక ప్రాంతాన్ని రూ. 3, 4 వేల కోట్లు ఖర్చు పెట్టి అభివృద్ధి చేస్తామన్నారు.

### సింగరేణిపై అపోహలు వద్దు..

సింగరేణి వారసత్వ ఉద్యోగాలు, మెడికల్ బోర్డు రద్దు చేస్తారని విష ప్రచారం చేసే వారిని మోకాళ్లపై కూర్చొబెట్టాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు రేవంత్ పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. 'బీఆర్ఎస్‌ను ఇక నుంచి బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి అని పిలుస్త. ఫోన్ ట్యాపింగ్ ద్వారా బ్లాక్ మెయిల్ చేసి రూ. వందల కోట్లు దోచుకున్నారు. బీఆర్ఎస్ ఖాతాలో రూ. 1,500 కోట్లు ఎవడబ్బ సొమ్ము'అని రేవంత్ ప్రశ్నించారు. 'మా అక్కలు దసరా పండుగ రోజు పాలపిట్టల్లా కనిపిస్తున్నారు. బతుకమ్మ చీరలను బాయికాడ పిట్టలను బెదిరించడానికి కట్టారు.. ఇందిరమ్మ చీరను సారె రూపంలో మీ తమ్ముడు పెట్టాడు.. ప్రతి ఏడాది ఇందిరమ్మ చీరను తప్పకుండా ఇస్తాం'అని రేవంత్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రులు ఎంపీ కడియం కావ్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు సిరిసిల్ల రాజయ్య, ఐత ప్రకాశ్‌రెడ్డి, జనక్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



### ఓటుకు నోటు కేసులో
## సాక్ష్యాలు మాయం

(మొదటిపేజీ తరువాయి)

రోడ్‌షోలు నిర్వహించారు. అనంతరం కార్నర్ సమావేశాల్లో మాట్లాడారు. హనుమకొండ భారాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలోనూ మాట్లాడారు. "2015లో రూ.50 లక్షలు ఇచ్చి ఎమ్మెల్యేను కొనుగోలు చేసిన కేసులో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నిందితుడిగా ఉన్నారు. ఆ కేసు విచారణ తుది దశకు వచ్చిన నేపథ్యంలోనే ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదం జరిగింది. మూడంతస్తుల భవనంలో మంటలు ఆర్పేందుకు మూడు గంటలు పట్టిందని చెప్పడం వెనుక కుట్ర కోణం దాగి ఉంది. ఈ ప్రమాదంలో పలు ముఖ్యమైన కేసులకు సంబంధించిన సాక్ష్యాలు కాలిబూడిదైతే.. ఫోరెన్సిక్ అధికారులు నామమాత్రంగా ప్రెస్‌నోట్ విడుదల చేసి చేతులు దులుపుకొన్నారు. అగ్ని ప్రమాదంలో ఎలాంటి కుట్ర లేకుంటే భారాస శాసనసభ పక్షం..నిపుణులతో కలిసి వస్తుంది. డీజీపీ అనుమతించాలి. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ ఘటనపై విశ్రాంత న్యాయమూర్తితో సమగ్ర విచారణ చేయించాలి. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత రాష్ట్రంలో భూమాఫియా రాజ్యమేలుతోంది. స్వయంగా సీఎం సోదరులే భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. రేవంత్‌రెడ్డి అనుచరుడు రోహిణ్‌రెడ్డి దక్కన్ సిమెంట్ యాజమాన్యానికి తుపాకీ పెట్టి డబ్బులు వసూలు చేశారని స్వయంగా మంత్రి కొండా సురేఖ కుమార్తె ఆరోపిస్తే ఆ ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమారుడు భూకబ్జా చేస్తే ఆ ఘటనపై కేసు నమోదు చేసిన స్థానిక పోలీసు అధికారిని ఎందుకు బదిలీ చేశారు? ఏడాదిన్నర క్రితం పొంగులేటి ఇంటిపై ఈడీ దాడులు చేసింది. ఆ ఘటనపై ఇప్పటివరకు కేసు ఎందుకు నమోదు చేయలేదు' అని కేటీఆర్ ప్రశ్నించారు.



### వీధి రౌడీలా రేవంత్ భాష

(మొదటిపేజీ తరువాయి)

ఆయన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి, గడ్డపోతారం తదితర ప్రాంతాల్లో 15 కార్నర్‌మీటింగ్‌లు, రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శల వర్షం కురిపించారు. తన తండ్రి వయసు ఉన్న కేసీఆర్‌ను పట్టుకుని కనీస గౌరవం లేకుండా, అతినీచమైన భాషను మాట్లాడుతున్నారని అన్నారు. కేసీఆర్‌ను దూషిస్తే నిరుపేదల కడుపులు నిండవని, సంక్షేమ పథకాలు అమలు చేస్తేనే పేదల కడుపులు నిండుతాయని సూచించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిలదీస్తున్న కేసీఆర్‌ను జైలులో పెడతామని కాంగ్రెస్ అంటోందని హరీశ్‌రావు మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎన్నికల హామీలను అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి రాసిచ్చిన బాండ్ పేపర్ బౌన్స్ అయిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఈ రెండున్నరేళ్ల పాలనలో కొత్త పథకాలు ఇవ్వకపోగా, బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలను బంద్ చేశారని విమర్శించారు. సంక్షేమ పథకాలను అమలు చేసి, పేదలకు అన్నం పెట్టిన కేసీఆర్‌కు ఓటేస్తారా?, హామీల పేరుతో జనాలకు సున్నం పెట్టిన రేవంత్‌రెడ్డికి ఓటేస్తారో?.. ప్రజలు ఆలోచన చేయాలని హరీశ్‌రావు అన్నారు. అసలు ఎవరో.. నకిలీ ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూపాలపల్లిలో చేసిన వ్యాఖ్యలకు హరీశ్ కౌంటర్ ఇచ్చారు. ఎన్నికల హామీలను ఎగ్గొట్టిన రేవంత్‌రెడ్డినే నకిలీ అని అన్నారు.

### యాసంగి రైతు భరోసా కోసం
## ప్రభుత్వం కసరత్తు




(మొదటిపేజీ తరువాయి)

ఆఫ్ ఇండియాకు (ఆర్బీఐ) ఇండెంట్ సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రుణం సేకరించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ నెల 10వ తేదీన ఆర్బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సమీకరించనున్నారు. 13 ఏళ్ల కాలపరిమితితో రూ.2,000 కోట్లు, 16 ఏళ్లకు మరో రూ.2,000 కోట్లు, 21 ఏళ్ల కాలపరిమితితో రూ.2,500 కోట్లు, 27 ఏళ్లకు రూ.2,500 కోట్ల చొప్పున ప్రభుత్వం రుణం తీసుకోనుంది. ఈ-వేలం ప్రక్రియ పూర్తయిన తర్వాత నిధులు ప్రభుత్వ ఖజానాకు చేరతాయి. అనంతరం రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను ప్రారంభించే అవకాశముంది. ఇప్పటికే యాసంగి సీజన్‌కు సంబంధించి అర్హులైన రైతుల జాబితా కూడా సిద్ధమైనట్లు సమాచారం. అయితే, ఈ నిధుల విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలే ఒక స్పష్టత ఇచ్చారు. మిర్యాలగూడలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన వెంటనే రైతు భరోసా నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. దీంతో నిధుల సమీకరణ ప్రక్రియ పూర్తయినా, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. తమ ప్రభుత్వం పార్టీలకతీతంగా, ఎలాంటి వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని సీఎం తెలిపారు. ఇప్పటికే పంట రుణాల మాఫీ కింద రైతులకు రూ.21 వేల కోట్లు అందించామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ కూడా ఇచ్చామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

### పెద్ద ఎత్తున
## ఓట్లను కొనేందుకు కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

కబడ్డీ ఆటను ప్రారంభించాయన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి 50 సీట్లు ఖాయమని, కబడ్డీ కప్ బీజేపీ గెలుచుకోవడం తథ్యమని తేలడంతో కాంగ్రెస్, ఎంఐఎం మధ్య రూ.100 కోట్ల డీల్ (మ్యాచ్ ఫిక్సింగ్) కుదిరిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ డబ్బుతో పెద్ద ఎత్తున ఓట్లను కొనుగోలు చేసి, బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఆదివారం సాయంత్రం బండి సంజయ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో 'విజయ సంకల్ప ర్యాలీ'నిర్వహించారు. బీజేపీ తెలంగాణ




ఇన్‌చార్జి, మహారాష్ట్ర ఐటీ మంత్రి ఆశీష్ షెల్లార్, మాజీ ఎంపీ, సినీ నటి నవనీత్ కౌర్ ర్యాలీకి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రెవెన్యూ గార్డెన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో వేలాది మంది కాషాయ పగిడీలు ధరించి పాల్గొన్నారు. టవర్ సర్కిల్ వద్ద బండి సంజయ్, నవనీత్ కౌర్ ప్రసంగించారు. అభివృద్ధి నినాదంతో తాము కరీంనగర్ ఎన్నికలకు వెళ్తున్నామని, బీజేపీ 50 సీట్లు గెలిచి మేయర్ పీఠాన్ని అందుకోబోతోందని సర్వేలన్నీ తేల్చడంతో కాంగ్రెస్, ఎంఐఎం నేతల వెన్నులో వణుకు మొదలైందని అన్నారు. అందుకే ఒవైసీ శనివారం రాత్రి కరీంనగర్‌కు వచ్చి ఎంఐఎం గేర్ మారుస్తుందని మాట్లాడారని గుర్తు చేశారు. రామాయణం, మహాభారతంలో రావణుడు, కౌరవులకు ఏ గతి పట్టిందో.. ఎంఐఎంకు కూడా అదే గతి పట్టించేదాకా విశ్రమించే ప్రసక్తే లేదని అన్నారు.



### సిద్దిపేట జిల్లాలో పెద్దపులి కలకలం

**సిద్దిపేట:** సిద్దిపేట జిల్లాలో ఓ పెద్దపులి సృష్టిస్తున్న భయాందోళనలు కొనసాగుతున్నాయి. వరుసగా పశువులపై దాడి చేస్తూ వాటిని చంపుతుండటంతో స్థానిక గ్రామాల్లో తీవ్ర కలకలం రేగింది. ఈ పులిని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు తమ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. తాజాగా కొహెడ మండలం ఆరెపల్లి గ్రామంలో పులి సంచరించినట్లు కొంతమంది రైతులు చెప్పడంతో గ్రామస్థులు భయంతో వణికిపోతున్నారు. సమీపంలోని చంద్రానాయక్ తండా వద్ద మాలోత్ రమేష్ అనే రైతుకు చెందిన ఐదు దూడలను పులి చంపేసింది. స్థానికుల సమాచారంతో అటవీ, పోలీస్ శాఖ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పులి పాదముద్రలను సేకరించారు. పులి సంచరిస్తున్న ప్రదేశాల్లో కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రజలకు కీలక సూచనలు జారీ చేశారు. రైతులు తమ పశువులను పొలాల్లో కాకుండా ఇళ్ల వద్దే సురక్షితంగా కట్టేసుకోవాలని సూచించారు. అలాగే, పొలాలకు ఒంటరిగా వెళ్లవద్దని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ పులి గతంలో జిల్లాలోని ఘనపూర్, అక్కెనపల్లి, బస్వాపురం గ్రామాల్లోనూ పశువులపై దాడి చేసి చంపేసింది. శనివారం జనగామ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో పశువులను చంపిన తర్వాతే ఇది సిద్దిపేట జిల్లాలోకి ప్రవేశించి ఉంటుందని అధికారులు తెలిపారు. పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి ఈ పులి తెలంగాణలోకి వచ్చినట్లు అనుమానిస్తున్నారు. వారం రోజుల వ్యవధిలోనే తెలుగు రాష్ట్రాల్లో ఇది రెండో ఘటన. ఫిబ్రవరి 6న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి సమీపంలో సంచరించిన ఓ పులిని అటవీ అధికారులు విజయవంతంగా పట్టుకున్న విషయం తెలిసిందే.



### పదేళ్లు దోపిడీ చేసినందుకు
## ఓటు వేయాలా?

**ఖమ్మం:** గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా.. మళ్లీ ఇప్పుడు తాము వచ్చాకే మొదటి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి రూ.22,500 కోట్ల నిధులు వె చ్చిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో పేదలు రేషన్ కార్డుల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగితే పట్టించుకోలేదన్నారు. అప్పుడు ఇచ్చిన దొడ్డు బియ్యం పేదలకు ఉపయోగపడలేదని చెప్పారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోని 1.05 కోట్ల కుటుంబాలకు గాను 1.02 కోట్ల కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. అంతేకాక ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా రూ.27 వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యం, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# మౌనంగా నిలిచిన కాకతీయుల త్రికూటాలయం

## గ్రామ ఐక్యతతో వెలుగులోకి వస్తున్న శిల్ప వారసత్వం

**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్ :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామ శివారులో, చెరువు గట్టుపై ఒక ప్రాచీన త్రికూటాలయం నిశ్శబ్దంగా నిలిచి ఉంది. శతాబ్దాల కాలంగా పూజల వెలుగు చూడని ఈ ఆలయం, నేడు గ్రామస్తుల చొరవతో మళ్లీ గుర్తింపును పొందుతోంది. ఇది కేవలం ఒక దేవాలయం కాదు. కాకతీయుల కాలానికి చెందిన శిల్ప వారసత్వానికి మిగిలిన అపూర్వ సాక్ష్యం.

### శిల్ప నిర్మాణంలో శాస్త్రీయ దృష్టి

ఈ త్రికూటాలయం నిర్మాణ శైలే దాని విశిష్టత. నక్షత్రాకార అధిష్ఠానంపై నిర్మించిన ఆలయంలో తూర్పు అభిముఖంగా శివుడు, ఉత్తరాభిముఖంగా ఆదిత్యుడు, దక్షిణాభిముఖంగా కేశవమూర్తి ప్రతిష్ఠింపబడ్డారు. సంధ్యా వేళ పడమర నుంచి వచ్చే సూర్యకాంతి నేరుగా శివలింగాన్ని తాకేలా ఆలయాన్ని నిర్మించడం అప్పటి శిల్పుల ఖగోళ పరిజ్ఞానానికి నిదర్శనంగా నిలుస్తోంది.



### కాకతీయుల కాలానికి చెందిన శిల్ప సంపద

చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం ఈ ఆలయం క్రీ.శ. 11--13వ శతాబ్దాల మధ్య కాకతీయుల పాలన కాలంలో నిర్మితమై ఉండవచ్చని భావిస్తున్నారు. గ్రానైట్ రాతితో చెక్కిన శివలింగాలు, ద్వారబంధాలపై ద్వారపాల కుల శిల్పాలు, ఘటాదారిణులు, చామరదారిణులు, ఉత్తరాశిపై గజలక్ష్మీ ప్రతిమ, ప్రస్థరంపై సూక్ష్మ నాగర శిఖరాలు, 16 ఆకులతో కూడిన భువన శిల్పం. ఇవన్నీ కాకతీయుల శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబిస్తాయి.

### నిర్లక్ష్యానికి గురైన వారసత్వం

పూజలు నిలిచిపోవడంతో ఆలయం క్రమంగా శిథిలావసకు చేరుకుంది. దక్షిణాభిముఖంగా ఉన్న కేశవమూర్తి విగ్రహం తీవ్రంగా ధ్వంసమై శిరస్సు, భుజాలు కోల్పోయింది. రంగ మండపానికి చెందిన స్తంభాలు కాలగర్భంలో కలిశాయి. నంది విగ్రహం కనిపించకుండా పోయింది. ఆలయానికి చెందిన భూములు అక్రమ కబ్జాలకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఒక దశలో ఆలయ ప్రాంగణం అసాంఘిక కార్యకలా పాలకు కేంద్రంగా మారిన పరిస్థితి ఉంది.



### అపూర్వ విగ్రహ సంపద

ఆలయ పరిసరాల్లో అద్భుతంగా చెక్కిన విఘ్నేశ్వరుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అంకుశం, పాశం ధరించిన గణపతి, వరద ముద్రతో, లడ్డుతో సుఖాసనంలో దర్శనమిస్తాడు. ఉదరబంధ సర్పం శిల్పకళలోని సూక్ష్మతను తెలియజేస్తుంది. ప్రదక్షిణ మార్గంలో ఆంజనేయ స్వామి విగ్రహం, పక్కనే శిరస్సులేని చాముండ విగ్రహం ఉన్నాయి. ఒకప్పుడు పవిత్ర జలాల కోసం ఉపయోగించిన కోనేరు నేడు మట్టిలో కలిసిపోయింది. ఆశ్చర్యకరంగా, ఇప్పటివరకు ఈ ఆలయానికి సంబంధించిన శాసనాలు ఏవీ లభించకపోవడం చరిత్ర పరిశోధకులకు ప్రశ్నగా మారింది.

### గ్రామస్తుల చొరవతో పునర్జీవనం

ఆలయ ప్రాధాన్యతను గుర్తించిన ముత్తారం గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. పునరుద్ధరణ కమిటీ ఏర్పాటు చేసి చెత్తను తొలగించి, శిథిలాలను సరిచేసి ఆలయంలో మళ్లీ నిత్య పూజలు ప్రారంభించారు. మహాశివరాత్రి, కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ధ్వజస్తంభం, నవగ్రహాలు, నంది విగ్రహాల ప్రతిష్ఠకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

### సంరక్షణ అవసరం

ప్రజల భక్తి, ఐక్యతతో ఆలయానికి మళ్లీ జీవం పోస్తున్నప్పటికీ, ఇది శాస్త్రీయ సంరక్షణకు అర్హమైన చారిత్రక కట్టడమే. కాకతీయుల కాలానికి చెందిన ఇటువంటి త్రికూటాలయాలు రాష్ట్రవ్యాప్తంగా అరుదుగా కనిపిస్తాయి. సరైన డాక్యుమెంటేషన్, పురావస్తు శాఖ పర్యవేక్షణ, శాస్త్రీయ పునరుద్ధరణ లేకపోతే ఈ వారసత్వం మరోసారి ప్రమాదంలో పడే అవకాశం ఉంది. శతాబ్దాల మౌనాన్ని చెరిపేసిన ఈ త్రికూటాలయం, ప్రజల చేతుల్లో తిరిగి వెలుగులోకి వచ్చింది. ఇప్పుడు దీనిని భక్తి స్థలంగా మాత్రమే కాకుండా, రాబోయే తరాలకు చరిత్రగా అందించాల్సిన బాధ్యత సమాజం, ప్రభుత్వంపై ఉంది.





## సమైక్య యూత్ అసోసియేషన్‌లో 50 మంది యువకుల చేరిక

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** తెల్లాపూర్ 263 జిహెచ్ఎంసి డివిజన్ పరిధిలోని సమైక్య యూత్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సమైక్య యూత్ అసోసియేషన్ పౌండర్ సిపి ప్రభాకర్ రెడ్డి, ప్రెసిడెంట్ ఎం మహేష్ ఆధ్వర్యంలో 263 డివిజన్ కు సంబంధించిన 50 మందియువకులు అసోసియేషన్ లో చేరారు. ఈ సందర్భంగా ఫౌండర్ సిపి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ అసోసియేషన్ ద్వారా అనేక సంవత్సరాలుగా సామాజిక సేవలో భాగంగా అనేక కార్యక్రమాలు చేస్తూ వస్తున్నామని, అందులో ముఖ్యమైనవి కరోనా సమయంలో పేద ప్రజలకు నిత్యవసర సరుకులతో పాటు ఆర్థికంగా అండగా నిలబడడం జరిగిందని, పేద పిల్లలను బడిలో చేర్పించడం వారికి కావలసిన కనీస వసతులు సమకూర్చడం జరిగిందని, పండగల సమయంలో స్థానిక మహిళలకు ముగ్గుల పోటీలతో పాటు,మహిళలు రాజకీయంగా కూడా ఎదగడానికి వారికి తోడ్పాటును అందించడం జరిగిందని సిపి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సమైక్య యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్ మాట్లాడుతూ, సిపి ప్రభాకర్ రెడ్డి చూపిన దారిలో నడుస్తూ, మహనీయుల పుట్టినరోజులను వర్ధంతి కార్యక్రమాలను జరుపుతూ, అనేక సందర్భాలలో సమైఖ్య యూత్ తరఫున రక్తదాన శిబిరాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని మహేష్ తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో 263 డివిజన్ నాయకులు సమైక్య యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## లో వోల్టేజీ సమస్యను పరిష్కరించిన గ్రామ సర్పంచ్ బీస్ ధనలక్ష్మి చందర్ గౌడ్

**ఆత్మకూరు( ఎం). రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం). మండల కేంద్రంలోని రామ్ నగర్ కాలనీ 7,8 వార్డులలో గత కొన్ని రోజులుగా లో వోల్టేజి సమస్యతో కరెంటు సరిగా రాక. కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని ప్రజలు వార్డు సభ్యులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి సహకారంతో ఈరోజు కొత్త కరెంటు స్తంభాలు వైరు లాగించి లోవోల్టేజ్ సమస్యని పరిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా సర్పంచ్.బీసు ధనలక్ష్మి. చందర్ గౌడ్ మాట్లాడుతూ.లో.వోల్టేజ్ సమస్యపై తొందరగా స్పందించి,పరిష్కరించిన ఏఈ ప్రవీణ్. కి వారి సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్ మాజీ సర్పంచ్ బీసు చందర్ గౌడ్ వార్డు సభ్యులు బూడిద శేఖర్ గౌడ్ ఎలగందుల సైదులు సిపిఐ నాయకులు మజ్జిగ నర్సయ్య. కాలనీవాసులు మాధ సత్తయ్య గౌడ్ , రాగిరి నరసింహ గౌడ్, పోతగాని మల్లయ్య తవిటి హరినాధం వీరసరపు శేఖర్ గౌడ్ జూనియర్ లైన్ మెన్ జన్నాయికోడె మురళి తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

- ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి
- సూర్యాపేట జిల్లా ఎస్పి కె.నరసింహ

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** బుధవారం సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, తిరుమలగిరి, కోదాడ,హుజూర్నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీలకు జరగనున్న రెండవ సాధారణ మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకుందని ఎన్నికలను ఇతర శాఖల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తాం అని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన పోలీసు నిఘా ఉన్నది అన్నారు, ప్రలోభాల ను నిర్మూలించి ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తున్నాము అన్నారు. దీనికోసం ప్రత్యేక నిఘా బృందాలు పని చేస్తున్నాయని తెలిపినారు. అదనపు ఎస్పీలు, డిస్పీల ఆధ్వర్యంలో ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది అప్రమత్తంగా పని చేస్తున్నారు అన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని కోరారు. ఐదు మున్సిపాలిటీ కేంద్రాలలో 1250 మంది పోలీస్ సిబ్బందితో రక్షణ బందోబస్తు నిర్వహణకు ప్రణాళిక చేయడం జరిగిందని తెలిపారు. ఐదు మున్సిపాలిటీ కేంద్రాలలో 141 వార్డులకు గానూ 372 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగుతుండగా 115 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగింది అన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా మున్సిపాలిటీ కేంద్రాలలో సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసు ఫ్లాగ్ మార్చి నిర్వహించడం జరిగిందని ఎన్నికల నియమావళి పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీ పరిధికి అదనపు ఎస్పీ, డి.ఎస్.పి స్థాయి అధికారి స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారిగా ఉంటారు, అలాగే ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్స్ విధులు నిర్వహిస్తుందని తెలియజేశారు





# అశ్వారావుపేటలో కాంగ్రెస్ జోరు

### కట్ట సింధుజ గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యే ఆదినారాయణ ఇంటింటా ప్రచారం

**అశ్వరావుపేట, రాజముద్ర న్యూస్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావు పేట మున్సిపాలిటీలో ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. నాలుగో వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కట్ట సింధుజను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముమ్మర ప్రచారం చేపట్టారు. వార్డులోని ప్రతి వీధి, ప్రతి ఇల్లు తిరుగుతూ ప్రజలతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలు తమ ప్రాంతంలోని తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాల వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యలను ఓపికగా విన్న ఆయన, కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థుల విజయం అవసరమని ఆదినారాయణ పేర్కొన్నారు. కట్ట సింధుజ నిరంతరం ప్రజల మధ్య ఉండే వ్యక్తి అని, ఆమె గెలుపుతో వార్డుకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో నడిపిస్తామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పేదలకు ఇళ్లు, మహిళల రక్షణ, యువతకు ఉపాధి వంటి అంశాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ హయాంలోనే నిజమైన అభివృద్ధి సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఇంటింటా ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, నాలుగో వార్డులో కాంగ్రెస్ విజయం ఖాయమని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమంలో తుమ్మ రాంబాబు, చిరంజీవి నాయుడు, జూపల్లి ప్రమోద్, జూపల్లి కోదండ వెంకట రామారావు, సీమకుర్తి వెంకటేశ్వరరావు, మున్నేర్ పాషా, కౌలూరి వెంకటేష్, షేక్ నజరుద్దీన్, షేక్ షరీఫ్, సవల హరీష్, బొడ్డు సత్యనారాయణ, కాంగ్రెస్ కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## కూసుమంచిలో పేదల బియ్యం పక్కదారి

- ద్విచక్ర వాహనాల్లో తిరుగుతూ సేకరణ
- పేదల పొట్ట కొడుతున్న అక్రమార్కులు
- నంబర్ లేని వాహనాల్లో గుట్టుగా తరలింపు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ప్రభుత్వం పేదల కోసం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న పిడిఎస్ బియ్యం అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి.దొరికితేనే దొంగ అనే విధంగా వ్యవహరిస్తూ టన్నుల కొద్దీ రేషన్ బియ్యాన్ని గుట్టుగా పక్కదారి పట్టిస్తున్నారు.కూసుమంచి మండలంలోని బోటిమీదితండాకి చెందిన సురేష్ అనే వ్యక్తి,మరి కొందరితో కలిసి ద్విచక్ర వాహనాల మీద ఊర్లు తిరుగుతూ గ్రామాల్లో రేషన్ కార్డుదారుల నుంచి కిలో బియ్యం సుమారు రూ 10 నుండి 12 రూపాయల వరకు కొనుగోలు చేస్తున్నారు.నిత్యం కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని పలు గ్రామాల్లో ద్విచక్ర వాహనాల పై తిరుగుతూ గ్రామాల్లో మధ్యవర్తులను నియమించుకుని అక్రమంగా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. కొను గోలు చేసిన బియ్యాన్ని అక్రమార్కులు మామిడి తోటల్లో, తండాకు దూరంగా నిశబ్ద ప్రాంతాల్లో,పాత నివాస గృహాల్లో నిల్వ ఉంచి,రాత్రి వేళల్లో గస్తీ కాస్తూ నంబర్ లేని ఆటోలో,ట్రాలీ వాహనాల్లో గుట్టుగా తరలిస్తున్నారు.

### పేదల పొట్ట కొడుతూ కొనసాగుతున్న దందా..!

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్న బియ్యాన్ని పంపిణీ చేసి పేదల కడుపు నింపుతుంటే రేషన్ మాఫియా మాత్రం పేదల కడుపుకొడుతుంది. ఇదిలా ఉండగా గ్రామాల్లోని కొందరు చౌక దుకాణాల (రేషన్)డీలర్లు ఈ అక్రమార్కులతో చేయి కలిపి సాధ్యమైనంత వరకు కొందరి కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి,వాటిని నిల్వ ఉంచి,ఎవరికి అనుమానం రాకుండా అక్రమంగా తరలిస్తూ రీసైక్లింగ్ చేస్తూ ఆ తర్వాత కోదాడ,ఆంధ్రాలోని కాకినాడ, లింగాలతో పాటుగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.తరచూ అధికారులు దాడులు నిర్వహించి టన్నుల కొద్దీ బియ్యాన్ని పట్టుకుంటున్నా,ఈ రేషన్ దందా కొనసాగుతూనే ఉంది.పేదల పొట్ట కొడుతూ రేషన్ దందా కొనసాగిస్తున్న అక్రమార్కుల పై పిడి యాక్ట్ వంటి కేసులు నమోదు చేసి అక్రమ రవాణాకి చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** స్నేహం అనేది ఓ మధురమైన మరుపు రానిది అలాంటి స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలాజీ గ్రాండ్ హోటల్లో 2004బి2007 బ్యాచ్ కు చెందిన శ్రీ సాయి త్రివేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా ఆనాటి అధ్యాపకులు రమేష్, జీవీ, వెంకటరమణ, రవి, ధనుంజనచారి లను ఘనంగా సన్మానించుకున్నారు.19 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.



## క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల మెరుగుకు ప్రత్యేక కృషి

- మేడిపల్లి డివిజన్ క్రిస్టియన్ బస్తీలో నేతల క్షేత్ర స్థాయి పర్యటన అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నాయకుల పరిశీలన
- బస్తీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లి డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ బస్తీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా క్రిస్టియన్ బస్తీలో మౌలిక వసతులను పరిశీలించి, స్థానిక సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో ముచ్చటించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో ప్రధానంగా ఉన్న తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల వంటి మౌలిక వసతుల ప్రస్తుత పరిస్థితిని నేతలు అంచనా వేశారు. ప్రజలు కోరిన వెంటనే స్పందించి క్షేత్ర స్థాయికి రావడంపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, పీర్జాదిగూడను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అంకితభావంతో పని చేస్తున్నామని తెలిపారు. క్రిస్టియన్ బస్తీలోని ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించామని, కాలనీ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా రాజీ పడకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని వివరించారు. అధికారులు, ప్రజల సమన్వయంతో బస్తీ రూపురేఖలు మారుస్తామని, త్వరలోనే అన్ని సమస్యలకు మోక్షం కలుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గీత సంఘం అధ్యక్షులు దేశగోని శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ బొడిగె రాందాస్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ మునికుంట్ల సహదేవ్ గౌడ్ పాల్గొన్నారు.

## రష్యాలో భారతీయులపై దాడిచేసిన దుండగుడు 'నియోనాజీ'



**రష్యా :** రష్యా బాష్కోర్తోస్థాన్ రిపబ్లిక్‌లోని ఓ యూనివర్సిటీ విద్యార్థుల హాస్టల్‌లో భారతీయులపై కత్తితో దాడి చేసిన వ్యక్తి నియో–నాజీ సంస్థ భావజాలానికి ప్రభావితమైనట్లు తేలింది. అతడు వయసు కేవలం 15 ఏళ్లు మాత్రమే కావడం గమనార్హం. ఈ దాడిలో నలుగురు భారతీయులు సహా మొత్తం ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. నిందితుడు నిషేధిత వైట్ పవర్ లేదా నేషనల్ సోషలిజం సంస్థకు చెందినవాడిగా ఓ టెలిగ్రామ్ ఛానల్ పేర్కొంది. దీనిని రష్యా సుప్రీంకోర్టు 2012లోనే ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. దాడి సమ యంలో నిందితుడు కొన్ని నినాదాలు చేశాడు. బాధితుల రక్తంతో అతడు డార్మెటరీ గోడలపై నాజీ గుర్తును చిత్రీకరించి నట్లు రెన్‌టీవీ వెల్లడించింది. దాడి జరిగిన ప్రదేశం మొత్తం రక్తపు మడుగుగా మారింది. నిందితుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో ఇద్దరు పోలీసు అధికారులు కూడా గాయపడినట్లు మేజర్ జనరల్ ఇరిన వోల్క్ వెల్లడించారు.

# పదేళ్లు పాలించి పదుల సార్లు ఇదిగో అదిగో అన్న డబుల్ రోడ్డు

- ఇప్పుడు మేమే తెచ్చాము అని చెప్తున్న బిఆర్ఎస్ నాయకుల మాటలు హాస్యాస్పదం
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి

**ఆత్మకూరు( ఎం).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం). మండల కేంద్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సెంట్రల్ లైటింగ్ తో పాటు డబుల్ రోడ్డు ఇదిగో వచ్చే అదిగో వచ్చే అని పదుల సార్లు పలు వార్త పత్రికలలో రాతలు రాయించుకొని ఇప్పుడు మేమే రోడ్డు వేయిస్తున్నట్లు, కలెక్టర్ నిధులతో వేయిస్తున్నట్లు వాట్సాప్ లలో మెసేజ్ లు, పలు వార్తా పత్రికలలో వార్తలు రాయించుకోవడం సిగ్గు చేటు , కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు శ్రీ బీర్ల అయిలయ్య సహకారంతో గత సంవత్సరం 2025 జనవరి లోనే 175 లక్షల నిధులతో రోడ్డు పనులను ప్రారంభించుకోవడం జరిగింది. అయితే రోడ్డు పనులలో భాగంగా



హై స్కూల్ నుంచి ప్రస్తుత సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గారి ఇంటి వద్దకు రోడ్డు పై వర్షం నీళ్ళు నిలుస్తాయని అందుకోసం సీసీ వేయాలని అధికారుల సూచన మేరకు ఎస్టిమేషన్ పెంచుతూ సీసీ రోడ్డు కోసం అదనంగా డి ఎం ఆర్ ఎఫ్ నిధుల ద్వారా మరో 80 లక్షల రూపాయల నిధులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సహకారంతో మంజూరి ఇప్పించడం జరిగింది దానికి మేమే నిధులు తెప్పించి రోడ్డు వేయిస్తున్నట్లు, ఎమ్మెల్యే దగ్గరి గౌరవ కలెక్టర్ గారి దగ్గరికి వెళ్లి తామే నిధులు తెచ్చినట్లు మేమే రోడ్డు ప్రారంభిస్తున్నట్లు ఫోటోలు పెట్టి తప్పుడు మెసేజ్ లు వార్తలతో జనాలను తప్పు తోవ పట్టించడం సరైనది కాదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బాషబోయిన పాపయ్య, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి, మాజీ ప్యాక్స్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతగాని మల్లేశం, మాజీ ప్యాక్స్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, మండల మత్స్య సహకార అధ్యక్షులు ఎద్దు వెంకటేశ్వర్లు,మాజి దేవస్థాన చైర్మన్ దొంతరబోయిన భాస్కర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చిత్తర్ల అనిల్, నాయకులు కొమిరెల్లి నర్సి రెడ్డి,సుంకరి నిరంజన్, బెజ్జరబొయిన సాయి తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత మెగా వైద్య శిబిరం

**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్:** కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుక్కల వినయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో, బిగ్ టీవీ సహకారంతో మహేశ్వర మెడికల్ కాలజీ ఒ హాస్పిటల్స్ వైద్యుల సౌజన్యంతో ఫతేనగర్ గణేష్ టెంపుల్ వద్ద నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఫతేనగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ శిబిరం గొప్ప ఉపశమనాన్ని కలిగించింది. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్, ఫతేనగర్ డివిజన్ ప్రెసిడెంట్ కుక్కల రమేష్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, కొప్పిశెట్టి దినేష్ కుమార్ తోకలిసి ప్రారంభించారు. శిబిరంలో మొత్తం 346 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి అలాగే మెరుగైన ఆరోగ్యం కోసం క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర మెడికల్ కాలజీ ఒ హాస్పిటల్స్ వైద్యుల డా. చందన్, శ్వేత, కావ్య వారి సిబ్బందితో హాజరై ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు హమీద్ భాయ్, సర్పంచ్ అనిల్, క్యాసరాజు, వరాల స్వామి, వెల్డింగ్ నర్సింగ్ పాల్గొన్నారు.





# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

## ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని అభినందించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, రాజముద్ర న్యూస్:** జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్. ఉపాధ్యక్షులు ఏవి శ్రీధర్ రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు, సీనియర్ జర్నలిస్టులు దొంతుల వెంకటరామిరెడ్డి, కొలనుపాక చంద్రమౌళి,పల్లా మహేందర్ రెడ్డి, కోడికంటి శ్రీనివాస్, ఎస్. ముత్యంరెడ్డి, ఓ.రమేష్, రాజులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర ఎనలేనిదని తెలిపారు. ప్రతి నిమిషం ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలను అధికారులు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర అభినందనీయమని తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ కమిటీకి తన వంతు సహాయక సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.



## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా నివారిస్తా

### అంతారం గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామి

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** అంతారం గ్రామ పంచాయతీ పరిధిలోని నౌలయపల్లిలో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా నివారిస్తానని అంతారం గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామి హామీ ఇచ్చారు. చేవెళ్ల మండలం అంతారం గ్రామ పంచాయతీ పరిధిలోని నౌలాయపల్లి గ్రామంలో ప్రజలకు త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు అంతారం గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామి ఆదివారం తన సొంత నిధులతో బోరును రిపెరింగ్ (రి ప్రెస్) చేపించారు. నీటి సమస్యలను దృష్టిలో పెట్టుకొని గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవడం ప్రశంసనీయమని గ్రామస్తులు కొనియాడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కావాలి వెంకటేష్ బాబు, నాగారం ప్రవీణ్ గౌడ్, అలంపల్లి లక్ష్మారెడ్డి, ఆలంపల్లి నరసింహ రెడ్డి, మొండి శ్రీనివాస్, ఆలంపల్లి దామోదర్ రెడ్డి, గాదె అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో జర్నలిస్టులు ముందుండాలి

## ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని అభినందించిన టియూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

**ఉప్పల్, రాజముద్ర న్యూస్:** సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో జర్నలిస్టులు ముందుండాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ పేర్కొన్నారు. ఆదివారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకట్ రామ్ రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జర్నలిస్టులు తమ సంక్షేమ కార్యక్రమాలతో పాటు సామాజిక రుగ్మతులపై వివిధ ప్రజా సంఘాలతో కలుపుకొని ప్రజా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని





సూచించారు. జర్నలిజంలో నానాటికి పెరిగిపోతున్న పెడ ధోరణులను అరికట్టి, జర్నలిజం విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి జర్నలిస్టుపై ఉందన్నారు. జర్నలిస్టుల పక్షాన టీయూడబ్ల్యూజే నిరంతరం పోరాటం సలుపుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్, ఉపాధ్యక్షులు ఏవి శ్రీధర్ రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు, సలహాదారులు కొలనుపాక చంద్ర మౌళి, కోడికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

- ఈ నెల 9 నుంచి ఆన్లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026--28 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రెడిటేషన్ కమిటీ చైర్మన్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనున్నందున అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాలని సూచించారు. యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్ సైట్ http://ipr.telangana.gov.in ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.జిల్లా స్థాయిలలో ఆన్ లైన్ దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ నుంచి సమర్పించాలని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.



## పేదలకు అండగా నిలబడి పోరాడే పార్టీ ఒక్కటే సిపిఐ

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పాలమాకుల జంగయ్య

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** నిరంతరం పేద ప్రజల తరఫున పోరాడే కమ్యూనిస్టు పార్టీ సిపిఐని ఆదరించి, అండగా నిలిచి కంకి కొడవలి గుర్తుపై ఓటేసి సిపిఐ పార్టీ అభ్యర్థి మక్బూల్ ను గెలిపించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య ప్రజలను కోరారు. ఆదివారం రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా 10వ వార్డు రామన్నగూడలో గడప గడపకు ప్రచారం చేసి ప్రజలను కలిసి ఓటును అభ్యర్థించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పి, ప్రజలను మోసం చేసే బూర్జువ పార్టీలకు మరోసారి ఓటేసి మోసపోవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచార సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి రాష్ట్ర సమితి సభ్యులు కె రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం ప్రభు లింగం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల కార్యదర్శి కె శ్రీనివాస, బికెయంయు జిల్లా అధ్యక్షుడు జె అంజయ్య, జిల్లా సమితి సభ్యులు సుధాకర్ గౌడ్ , మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, గీత పనివాళ్ల సంఘం మండల కార్యదర్శి కృష్ణ గౌడ్, పాపయ్య, శివ, జలీల్, ఒగ్గు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాల స్థాపనతో 263 డివిజన్‌లో టెన్షన్ వాతావరణం

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** తెల్లాపూర్ 263 డివిజన్ ఇందిరానగర్ కాలనీ గద్దర్ సర్కిల్ లో గత పది రోజుల క్రితం శివాజీ విగ్రహాన్ని పెట్టడం జరిగింది. ఈ శివాజీ విగ్రహానికి అనుమతి లేని కారణంగా, అధికారులు పోలీసులు ఏ క్షణమైనా ఈ తొలగించే అవకాశాలు ఉన్నందున, అభిమానులు ప్రతిరోజు ఆ విగ్రహానికి పగలు రాత్రి కాపల గానే ఉంటున్నారు. ఒకవైపు శివాజీ అభిమానులు ఒకవైపు అధికారులు. పోలీసులు ఒకే చోట ఉంటున్న సంగతి అందరికీ తెలిసిందే. ఇక్కడ పెట్టిన శివాజీ విగ్రహానికి తెల్లాపూర్ 263 డివిజన్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉంది. అప్పుడప్పుడు అధికారులు ఇక్కడికి వచ్చి పరిశీలించి వెళ్తూనే ఉన్నారు. అయితే శుక్రవారం రోజు ఇంకొక వర్గానికి చెందిన వారు మహాత్మ జ్యోతిరావు పూలే అభిమానులు పూలే విగ్రహాన్ని తీసుకువచ్చి శివాజీ విగ్రహానికి పక్కన ఇదే సర్కిల్ లోనే పెట్టడం జరిగింది. ఆ సమయంలో అక్కడున్న శివాజీ విగ్రహం అభిమానులకు పూలే విగ్రహం అభిమానుల మధ్య వాగ్వి వాదం తోపులాటలు జరిగి ఉద్రిక్త వాతావరణం నెలకొంది.విషయం తెలుసుకున్న కొల్లూర్ పోలీసులు ఇక్కడికి చేరుకొని, ఈ రెండు వర్గాల వారిని అక్కడి నుండి పంపించి వేయడం జరిగింది. ఇదే విషయంలో శివాజీ వర్గం వారి మాటలు ఈ విధంగా ఉన్నాయి. మహాత్మా జ్యోతి రావు పూలే అంటే మాకు కూడా గౌరవం కానీ శివాజీ మహారాజ్ విగ్రహం పెట్టిన పది రోజుల తరువాత జ్యోతిరావు పూలే విగ్రహం శివాజీ విగ్రహం పక్కనే కావాలని పెట్టడం సమంజసం కాదని, తెల్లాపూర్ లో మహాత్మా జ్యోతి రావు పూలే పేరు మీద మనం ఒక కాలనీకి పేరు పెట్టుకున్నాం, అక్కడే ఆయన విగ్రహం పెట్టుకుంటే బాగుంటుందని, అంతే కానీ ఆ మహనీయుడిని కించపరిచే ఉద్దేశం మాకు లేదని వారి అభిప్రాయం తెలిపారు. పూలే వర్గం అభిమానులు చెప్పే వాదన ఈ విధంగా ఉంది. శివాజీ మహారాజు గొప్ప చక్రవర్తి ఆయన చనిపోయిన తరువాత ఆయన యొక్క చరిత్రను బయటికి తీసిన నాయకుడే లేడు అని, ఆ శివాజీ మహారాజును ఈరోజు ఇంతగా అభిమానించే వారికి ఆనాడు మహాత్మ జ్యోతిరావు పూలే నే ఈ విశ్వ ప్రపంచానికి పరిచయం చేసిందని ఈ పూలే వర్గం నేతలు అంటున్నారు. మేము శివాజీ విగ్రహాన్ని వ్యతిరేకించడం లేదు. ఇద్దరూ గొప్ప మహనీయులే వారి విగ్రహాలు ఇక్కడ కలిసి ఉంటే వారి యొక్క చరిత్రను ప్రజలకు మనము తెలియజేసే వాళ్ళమవుతామని, వర్గాలుగా విడిపోకుండా ఇద్దరి మహనీయుల విగ్రహాలను ఇక్కడే పెట్టేందుకు అందరము కృషి చేయాలని తెలిపారు. ఈ విగ్రహాల విషయంలో అధికారులు పోలీసులు ఒకవైపు, ఈ విగ్రహాల అభిమానులు మరోవైపు సమాలోచనలు వ్యూహాలు ఆలోచిస్తూనే ఉన్నారు. ఏ క్షణమైనా ఇక్కడ ఏదైనా జరగొచ్చు అనే టెన్షన్ వాతావరణం మాత్రం ఇక్కడ నెలకొని ఉందనే చెప్పాలి.







## సేవా భారతి ఆధ్వర్యంలో నేతాజీ నగర్ ఫ్రీ మెడికల్ క్యాంపు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** ఆర్ ఎస్ ఎస్ కు అనుబంధంగా పనిచేస్తున్న సేవా భారతి ఆధ్వర్యంలో నేతాజీ నగర్ ఎల్లమ్మ గుడి ప్రాంగణంలో లో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఇక్కడ డాక్టర్లు పేషెంట్లకు ట్రీట్మెంట్ మందులు ఇవ్వడం జరిగింది. నేతాజీ నగర్ నుండి 200 మంది వరకు పాల్గొన్నారు. దీనికి సహకరించిన వెస్టిన్ హాస్పిటల్ యాజమాన్యం నీకి సేవా భారతి నుండి ప్రత్యేక ధన్యవాదాములు.



## 18వ వార్డును ఆరోగ్య వార్డుగా తీర్చిదిద్దుతా

### డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట పట్టణంలోని 18 వ వార్డును ఆరోగ్య వార్డుగా తీర్చిదిద్ది అభివృద్ధిలో ఆదర్శంగా ఉంచుతానని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, 18 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రముఖ వైద్యులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 18 వ వార్డులో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. 18వ వార్డు నుంచి పోటీ చేస్తున్న తన చేయి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు అనంతరం ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరిస్తూ వార్డుకు తానేం చేస్తాను తెలుపుతూ ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో నిమ్మల వెంకన్న, నాగు నాయక్, కరీం భాయ్, వార్డు ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల 50వ వసంతాల ఆత్మీయ సమ్మేళనం

**ఆత్మకూరు( ఎం). రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు ( ఎం),మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో1989-89 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులందరికీ 50 వసంతాల వయసు దాటడంతో, ఆదివారం మండల కేంద్రంలో 50 వసంతాల ఆత్మీయ కలయికతో పాటు, ఆత్మీయ సమ్మేళనాన్ని ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాల్య మిత్రులందరికీ ఒకచోట కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందంటూ, పూర్వ విద్యార్థులందరూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఆటపాటలతో, సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉద్యోగిగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న లోడి భాస్కర్ గౌడ్, మొరిపిరాల గ్రామపంచాయతీ ఉపసర్పంచిగా ఎన్నికైన యాస జనార్దన్ రెడ్డిని ఈ సందర్భంగా బాల్యమిత్రులు సన్మానించి అభినందించారు.





## కర్తనూరు మల్లన్న స్వామి బోనాల జాతర

### పాల్గొన్న బిఆర్ఎస్ నాయకుడు కాల్వగడ్డ రాజ్ కుమార్

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** ముత్తంగి జిహెచ్ఎంసి డివిజన్ పరిధిలోని కర్ధనూర్ గ్రామంలో బ్రహ్మారాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాల్వగడ్డ రాజ్‌కుమార్ హాజరుకాగా, గ్రామ ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజ్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ వాతావరణంలో మల్లన్న స్వామి జాతర బోనాలు జరపడం అందరి కుటుంబ సభ్యుల రాకతో ఈ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం చూసిన తర్వాత మనసు పులకరించి పోయిందని రాజ్ కుమార్ అన్నారు. గ్రామ ప్రజల సుఖశాంతులు, అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, పార్టీ నాయకులు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.



# తరచూ బీర్ తాగుతున్నారా..?

## కలిగే అనర్థాలు తెలుసా..?

వీకెండ్ వచ్చిందంటే చాలు యువత ఎక్కువగా బీర్ తాగుతూ వీకెండ్ వైబ్స్ ను ఎంజాయ్ చేస్తూ ఉంటారు. బీర్ తాగడం సరదగా ఉన్నప్పటికీ ఇది మన ఆరోగ్యానికి గణనీయమైన హానిని కలిగిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. చాలా మంది బీరే కదా అని తేలికగా తీసుకుంటూ ఉంటారు. కానీ బీర్ లో కూడా ఆల్కహాల్ ఉంటుంది. ఇది మన ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. బీర్ తాగడం వల్ల పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. ఎముకలు బలహీనంగా తయారవుతాయి. 35 సంవత్సరాలు దాటిన తరువాత ఎముకల సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మహిళలు బీర్ తాగడం వల్ల హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలు తలెత్తుతాయి. నెలసరి సమస్యలు రావడం, మానసికపరమైన సమస్యలు రావడం జరుగుతుంది. పురుషులు బీర్ తాగడం వల్ల వారిలో ఛాతి పెరుగుతుంది. టెస్టోస్టెరాన్ స్థాయిలు తగ్గి ఈస్ట్రోజన్ స్థాయిలు పెరుగుతాయి. అంతేకాకుండా శరీరం శక్తి, పనితీరుతో పాటు ఆత్మవిశ్వాసం కూడా తగ్గుతుంది. బీర్ తాగడం వల్ల ఫ్యాటీ లివర్ సమస్య కూడా తలెత్తుతుంది.

### లివర్‌పై తీవ్ర ప్రభావం..

చాలా మంది బీర్ తాగుతూ ఎంజాయ్ చేస్తున్నామని భావిస్తూ ఉంటారు. కానీ బీర్ వల్ల మన ఆరోగ్యానికి కలిగే హాని గురించి ఎవరూ ఆలోచించరు అని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా బీర్ తాగడం వల్ల మూత్రవిసర్జన పెరుగుతుంది. దీంతో శరీరం డీహైడ్రేషన్ బారిన పడుతుంది. తలతిరగడం, తలనొప్పి, అలసట వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. బీర్ లో ఉండే ఆల్కహాల్ పేగులో ఉండే పొరలను చికాకుకు గురి చేస్తుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు అధికం అవుతాయి. ఆమ్లత్వం పెరగడంతో పాటు పొట్టలో పుండ్లు కూడా ఏర్పడతాయి. బీర్ ను అధికంగా తీసుకోవడం వల్ల కాలేయంపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. దీర్ఘకాలం పాటు బీర్ తాగడం వల్ల సిర్రోసిస్, ఫ్యాటీ లివర్, ఆల్కహాలిక్ హెపటైటిస్ వంటి కాలేయ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. కాలక్రమేణా మెదడు పనితీరు కూడా దెబ్బతింటుంది. అభిజ్ఞా పనితీరు క్షీణించడం, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

### గుండె ఆరోగ్యంపై కూడా..

బీర్ తాగడం వల్ల గుండె ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుంది. గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయి. కనుక బీర్ ను తీసుకోకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు. బీర్ తాగే అలవాటును ఒక్కసారిగా మానేయలేని వారు ఈ అలవాటును క్రమంగా తగ్గించుకునే ప్రయత్నం చేయాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. బీర్ వంటి ఆల్కహాల్ కలిగిన పానీయాలను ఆరు నెలల పాటు తీసుకోకపోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంలో పెద్ద మార్పులను చూడవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు. బీర్ ను మానేయడం వల్ల మనం అనేక ఆరోగ్యప్రయోజనాలను పొందవచ్చని మొత్తం శరీర ఆరోగ్యం మెరుగుపడుతుందని వారు చెబుతున్నారు.




# నిశ్శబ్దం.. ప్రశాంతం

ప్రస్తుతం నిశ్శబ్దం కరవైంది. ఇంటా బయటా ఎక్కడ చూసినా శబ్ద ప్రపంచమే రాజ్యమేలుతోంది. ఒక్కసారి కళ్లు మూసుకొని చుట్టుపక్కల శబ్దాలను విని చూడండి. ఏదో ఒక చప్పుడు వినిపిస్తూనే ఉంటుంది. సోషల్ మీడియా రాకతో ఇది మరింత ఎక్కువైంది కూడా. ఏమాత్రం సమయం దొరికినా మొబైల్ ఫోన్లలో తల దూర్చటమే. వీడియోలు చూడటమో, పాటలు వినటమో ఏదో ఒకటి చేస్తూనే ఉంటాం. కొన్నిసార్లు ఇది రోజువారీ పనులకూ విఘాతం కలిగిస్తుంది. నిరంతం రకరకాల చప్పుళ్లకు గురవుతూ వస్తుంటే ఒత్తిడి, మానసిక అలసట, ఇతరులతో కలవక పోవటం వంటి విపరీత పరిణామాలకూ దారితీస్తుంది. ఇక్కడే నిశ్శబ్దం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. దీంతో మనసును ప్రభావితం చేసే బాహ్య ప్రేరకాల నుంచి తప్పించుకోవచ్చు. కోల్పోయిన ఏకాగ్రతను తిరిగి పొందొచ్చు. లోతైన ఆలోచనలతో మమేకం కావొచ్చు. ఇది మానసిక ప్రశాంతతకే కాకుండా వ్యక్తిగతంగా ఎదగటానికీ తోడ్పడుతుంది.

### మనసుంటే మార్గముంది

- ఉదయం లేవగానే కొద్దిసేపు ప్రశాంతంగా కూర్చొని గాఢంగా శ్వాస తీసుకోవాలి. ఆరోజు ఉద్దేశాన్ని నిర్ణయించుకోవాలి.
- నిశ్శబ్దంగా గడపటాన్నీ ముఖ్యమైన పనిగా భావించాలి. దీన్ని క్యాలెండర్‌లో సెట్ చేసుకోవచ్చు కూడా. కొద్ది నిమిషాలు నిశ్శబ్దంగా ఉన్నా పెద్ద మార్పే కనిపిస్తుంది. ఉదయం కాఫీ తాగేటప్పుడో, రాత్రి పడుకోబోయే ముందో.. వీలైన సమయాన్ని ఎంచుకొని కచ్చితంగా అప్పుడు నిశ్శబ్దంగా గడపటానికి ప్రయత్నించాలి.
- ఇంట్లో ఒక ప్రత్యేక స్థలాన్ని ఎంచుకోవటమూ మేలే. కిటికీ పక్కనో లేదా ఏదో ఒక మూలనో కుర్చీ వేసుకొని నిశ్శబ్దాన్ని పాటించాలి. ఈ స్థలం ప్రశాంతంగా ఉండటానికే ప్రత్యేకమని మనసులో నిర్ణయించుకోవాలి.
- ఇంట్లో వాళ్లకు తాము ఆయా సమయాల్లో మౌనాన్ని పాటిస్తున్నామనే సంగతిని తెలియజేయాలి. ఇది ఒంటరిగా ఉండటం కాదని, నిశ్శబ్దంగా ఉండటానికి విలువైన సమయాన్ని కేటాయించటమేనని స్పష్టంగా చెప్పాలి. దీంతో అనవసరంగా జోక్యం చేసుకోవటం తగ్గుతుంది. ప్రశాంతత అవసరాన్ని అర్థం చేసుకోవటానికి, గౌరవించటానికి తోడ్పడుతుంది.
- ధ్యానం చేస్తున్నప్పుడు, యోగాసనాలు వేస్తున్నప్పుడు చుట్టుపక్కల చప్పుళ్లేవీ లేకుండా చూసుకోవాలి. శ్వాస మీద ధ్యాస పెట్టటం, శరీర అవయవాలను గమనించటం ద్వారా అప్పటి క్షణాలను ఆస్వాదించాలి.
- ప్రశాంతంగా గడిపే సమయాన్ని వాస్తవిక దృష్టితో నిర్ణయించుకోవాలి. ఉరుకుల పరుగుల వ్యవహారాలతో గడిపేవారు తక్కువ సమయంతో ఆరంభించాలి. రోజును మొదలు పెట్టటానికి ముందు లేదా పని పూర్తయ్యాక ఒక్క నిమిషం ప్రశాంతంగా గడిపినా సానుకూల ప్రభావం చూపుతుంది.
- పార్కులోనో, తోటలోనో సహజ నిశ్శబ్దాన్ని సాధన చేయాలి. ఆ క్షణం మీద దృష్టి సారించాలి.
- కుర్చీలో కూర్చొని కాల్పనిక కథలు చదవాలి. దీంతో సానుభూతి, భావోద్వేగ వివేచన పెంపొదుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.
- రాత్రి పడుకునే ముందు ప్రశాంతంగా ఎంత సేపు గడిపామో పరిశీలించుకోవాలి. ఆ సమయంలో కలిగిన అనుభూతులను నెమరు వేసుకోవాలి. వీలైతే డైరీలోనూ రాసుకోవాలి.
- పెందలాడే నిద్రకు ఉపక్రమించాలి. హాయిని చేకూర్చే సాగదీత వ్యాయామాలు లేదా మంచం మీద వేసే ఆసనాలు సాధన చేయాలి.
- స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌ల వంటి వాటికి వీలైనప్పుడల్లా విరామం ఇవ్వాలి. వీటికి బదులు పుస్తకం చదవటం, చెట్ల మధ్య నడవటం, ప్రశాంతంగా కూర్చోవటం, చుట్టుపక్కలను గమనించటం వంటి పనులు చేయాలి. నిరంతరం వచ్చి పడే నోటిఫికేషన్లు, ఇబ్బడి ముబ్బడి సమాచారాన్ని కాస్త పక్కన పెడితే మానసిక ప్రశాంతత చేకూరుతుంది.
- కష్టంగా అనిపించినప్పటికీ కారును నిశ్శబ్ద ప్రాంతంగా పరిగణించటమూ మేలు చేస్తుంది. శబ్ద, నిశ్శబ్ద ప్రపంచాలను వేరు చేసుకోవటానికిది తోడ్పడుతుంది.
- అన్ని అలవాట్ల మాదిరిగానే నిశ్శబ్దంగా ఉండటాన్నీ నెమ్మదిగానే ఆరంభించాలి. ఆచరణకు వీలైన చిన్న మార్పులతోనే మొదలెట్టాలి.





### ఆరోగ్య వారధి

- నిశ్శబ్ద, ప్రశాంత వాతావరణాలు రకరకాల మార్గాల్లో ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడతాయి.
- రక్తపోటు తగ్గుతుంది.
- ఏకాగ్రత, తదేక దృష్టి పెంపొందుతాయి.
- గజిబిజి ఆలోచనలకు కళ్లెం పడుతుంది.
- మెదడు వృద్ధిని ప్రేరేపిస్తుంది.
- ఒత్తిడిని కలగజేసే కార్టిజోల్ హార్మోన్ తగ్గుతుంది.
- సృజనాత్మక శక్తి ఇనుమడిస్తుంది.
- నిద్రలేమి దూరమవుతుంది.

### పరిశోధనలేం చెబుతున్నాయి?

- 2021లో జరిగిన ఒక అధ్యయనంలో- నిశ్శబ్ద వాతావరణంలో లేదా మాట్లాడుతూ లేదా చుట్టుపక్కల రణగొణ ధ్వనుల మధ్య ఏకాగ్రతతో చేయాల్సిన పనులను 59 మందికి పరిశోధకులు అప్పగించారు. నిశ్శబ్ద వాతావరణంలో పనిచేసినవారిలో మెదడు మీద మరీ ఎక్కువగా భారం పడటం లేదని, ఒత్తిడి స్థాయులూ తక్కువగా ఉంటున్నాయని తేల్చారు.
- 2013లో ఎలుకల మీద నిర్వహించిన పరిశోధనలో- రెండు గంటల నిశ్శబ్దం మూలంగా మెదడులో జ్ఞాపకశక్తి, భావోద్వేగాలతో ముడిపడిన హిప్పోక్యాంపస్‌లో కొత్త కణాల వృద్ధి ప్రేరేపితమవుతున్నట్టు గుర్తించారు.
- 2006లో చేపట్టిన అధ్యయనంలో- సంగీతాన్ని విన్న తర్వాత 2 నిమిషాల సేపు నిశ్శబ్దాన్ని పాటిస్తే గుండె వేగం, రక్తపోటు గణనీయంగా తగ్గుతున్నట్టు తేలింది. వీటి విషయంలో మంద్ర, ప్రశాంతతను కలిగించే సంగీతాన్ని వినటం కన్నా నిశ్శబ్దమే మరింత ఎక్కువ ఫలితం చూపిస్తున్నట్టు బయటపడింది.
- 2003లో చేసిన పాత అధ్యయనంలో- చాలాకాలంగా రణగొణ ధ్వనుల ప్రభావానికి గురైతే గుండె వేగం, రక్తపోటు పెరుగుతున్నట్టు వెల్లడైంది.




## గాయపడటం అరుదు!

మహ్మద్ సిరాజ్ అంటే అంకితభావానికి కేరాఫ్ అడ్రస్ అని చెప్పొచ్చు. ఈ రోజుల్లో ఫాస్ట్ బౌలర్లు ఎంత సున్నితంగా తయారయ్యారో, ఫిట్‌నెస్ సమస్యలతో ఎలా సతమతం అవుతున్నారో అర్థం చేసుకోవచ్చు. అందుకే చాలా సెలక్టివ్‌గా మ్యాచ్‌లు ఆడుతున్నారు. కానీ సిరాజ్ అలా కాదు. అతను గాయపడడం, విశ్రాంతి తీసుకోవడం అరుదు. టీ20 ప్రపంచకప్‌లో అడుగు పెట్టడానికి ముందు అతడు హైదరాబాద్ తరఫున రెండు రంజీ మ్యాచ్‌లు ఆడాడు. ఆ జట్టు క్వార్టర్స్‌కు అర్హత సాధించి ఉంటే శుక్రవారం కూడా మ్యాచ్ ఆడుతూ ఉండేవాడు. రంజీ ట్రోఫీ కంటే ముందు దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో, అంతకుముందు టీ20 టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరిలోకి దిగాడు. టెస్టులు, వన్డేల్లో టీమ్ఇండియా కీలక బౌలర్‌గా ఉంటూ ఇలా మూడు ఫార్మాట్లలో దేశవాళీ క్రికెట్ ఆడుతున్నది ఒక్క సిరాజ్ మాత్రమే. రంజీ మ్యాచ్ అవ్వగానే విశ్రాంతి తీసుకోకుండా హైదరాబాద్‌లో సాధన చేస్తూ ఉన్నాడు సిరాజ్. అదీ అతడి నిబద్ధత.

# సిరాజ్ అంకితభావానికి హ్యాట్సాఫ్

### అనుకోకుండా తుది జట్టులోకి..

అయితే హర్షిత్ రాణా టోర్నీ ఆరంభానికి ఒక్క రోజు ముందు గాయపడడంతో అనూహ్యంగా సిరాజ్‌కు అవకాశం దక్కింది. కానీ.. ప్రత్యామ్నాయ బౌలర్‌గా ఎంచుకున్న సిరాజ్‌కు తుది జట్టులో చోటు కష్టమనే అనుకున్నారంతా. కానీ ప్రధాన పేసర్ బుమ్రా జ్వరం కారణంగా తొలి మ్యాచ్‌లో అందుబాటులో లేకుండా పోవడంతో అనుకోకుండా సిరాజ్‌కు తుది జట్టులో చోటు దక్కింది. ఈ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకుంటూ 3 కీలక వికెట్లతో విజృంభించాడు సిరాజ్. 162 పరుగుల లక్ష్యం అంటే టీ20ల్లో పెద్ద కష్టమేమీ కాదు. అమెరికా టాప్ ఆర్డర్ నిలబడితే ఛేదన సాధ్యమయ్యేదే. కానీ సిరాజ్ తన తొలి ఓవర్లోనే ప్రమాదకర ఆండ్రీస్ గౌస్‌ను పెవిలియన్కు చేర్చాడు. తర్వాత తెలుగు కుర్రాడు సాయితేజను ఔట్ చేశాడు. మిడిలార్డర్లో ధాటిగా ఆడుతున్న శుభమ్ రంజానేకు కూడా చెక్ పెట్టి యుఎస్ఏ ఓటమిలో కీలకపాత్ర పోషించాడు. ఏడాదిన్నరగా టీ20 జట్టు ఛాయల్లోనే కనిపించని ఆటగాడు.. ఇప్పుడిలా టీ20 ప్రపంచకప్ ఆడడం, సత్తా చాటడం అనూహ్యం అనే చెప్పాలి.

శుక్రవారం హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో క్రికెట్ సాధన చేస్తున్నాడు మహ్మద్ సిరాజ్ . అప్పుడే అతడికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. అది చేసింది టీమ్ ఇండియా మేనేజ్‌మెంట్. ప్రపంచకప్ ఆడాల్సిన హర్షిత్ రాణా గాయపడ్డాడని, తన స్థానంలో జట్టులోకి రావాలన్నది కాల్ సారాంశం. కొన్ని గంటల్లోనే ముంబయి విమానం ఎక్కేశాడు సిరాజ్. కట్ చేస్తే తర్వాతి రోజు రాత్రి ప్రపంచకప్‌తో భారత్ ఆడిన తొలి మ్యాచ్‌లో అతడు బరిలోకి దిగడమే కాదు.. 3 వికెట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మహ్మద్ సిరాజ్ టీ20 ప్రపంచకప్‌లో ఆడడం అన్నది ఎవ్వరూ ఊహించని విషయం. ఏడాదిన్నరకు పైగా టీ20 జట్టులోనే లేడు. చాలా కాలంగా జట్టు ఎంపికకు అతడిని పరిగణనలోకే తీసుకోవట్లేదు సెలక్టర్లు. టీమ్ ఇండియా తరఫున 45 టెస్టులు, 50 వన్డేలు ఆడి ప్రధాన బౌలర్లలో ఒకడిగా ఎదిగిన సిరాజ్‌కు టీ20ల్లో మాత్రం పేలవ రికార్డు ఉంది. ప్రపంచకప్‌నకు ముందు అతను 16 టీ20లు ఆడి 32.28 సగటుతో 14 వికెట్లు మాత్రమే తీశాడు. టీ 20ల్లో పెద్దగా వికెట్లు తీయకపోగా.. ధారాళంగా పరుగులిచ్చేస్తాడన్న ముద్ర పడిపోయింది అతడిపై. దీంతో అతడిని 2024 జులైలో శ్రీలంక పర్యటన తర్వాత టీ20 జట్టులోకే ఎంపిక చేయలేదు సెలక్టర్లు. బుమ్రా, అర్షదీప్ కాకుండా హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణలకే ప్రాధాన్యం దక్కుతోంది. కానీ ప్రసిద్ధ్ చివరగా ఆడిన సిరీస్‌ల్లో పేలవ ప్రదర్శన చేయడంతో అతడిని పక్కన పెట్టేశారు.



## టీమ్ఇండియా చాలా నేర్చుకోవాలి

**సునీల్ గావస్కర్**

ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా శనివారం యూఎస్ఏతో జరిగిన మ్యాచ్‌లో టీమ్ఇండియా బ్యాటర్లు తడబడిన విషయం తెలిసిందే. 12.4 ఓవర్ల సమయానికి భారత జట్టు 6 వికెట్లు కోల్పోయి 77 పరుగులు మాత్రమే చేసి, పీకల్లోతు కష్టాల్లో ఉన్నట్లు కనిపించింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వీరోచితంగా ఒంటరి పోరాటం చేయడంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ 49 బంతుల్లో 84 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అమెరికా జట్టు 132 పరుగులకే పరిమితమైన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో తడబాటుకు గురైన నేపథ్యంలో భారత్ మరింత మెరుగ్గా తన బ్యాటింగ్ ప్రణాళికలను రూపొందించుకోవాలని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సునీల్‌గావస్కర్ సూచించాడు. 'నా దృష్టిలో 160 స్కోర్ చేయడం తేలిక కాదు. టీమ్ఇండియా మంచి మార్జిన్‌తోనే (29 పరుగులు) గెలిచింది. అయితే భారతజట్టు ఈ మ్యాచ్ నుంచి చాలా నేర్చుకోవాలి. బ్యాటింగ్ డెప్త్ ఉంది. కానీ పవర్‌ప్లేలో తేలిగ్గా వికెట్లు సమర్పించుకోవడం సమంజసం కాదు' అని సునీల్ గావస్కర్ పేర్కొన్నాడు. 'ఎనిమిది మంది బ్యాటర్లతో భారత్ బరిలోకి దిగితే, ముగ్గురు మాత్రమే బౌలర్లుంటారు. 7 – 8 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోతే జట్టుకు పెద్ద సమస్య అవుతుంది. పవర్‌ప్లే ఆరు ఓవర్లు ఉంటుందనేది వాస్తవమే. కానీ జట్టులో.. ఎనిమిది మంది బ్యాటర్లుంటే అందులో నలుగురి వికెట్లను పవర్‌ప్లేలోనే కోల్పోవడం కరెక్ట్ కాదు. అలా అయితే మనల్ని మనమే ఒత్తిడిలోకి నెట్టుకున్నట్లవుతుంది' అని సునీల్ గావస్కర్ విశ్లేషించాడు.

# ఐర్లాండ్‌పై శ్రీలంక గెలుపు

**కొలంబో:** టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య శ్రీలంక బోణీ కొట్టింది. ఐర్లాండ్ నుంచి పోటీ ఎదురైనా తట్టుకుని, విజయాన్నందుకుంది. ఆదివారం గ్రూప్–బి పోరులో లంక 20 పరుగుల తేడాతో ఐరిష్ జట్టును ఓడించింది. మొదట లంక 6 వికెట్లకు 163 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (56 నాటౌట్), కమిందు మెండిస్ (44) సత్తా చాటారు. బౌలర్లలో మెకార్తీ (2/40), డాక్రెల్ (2/17) రాణించారు. బదులుగా ఐర్లాండ్ 19.5 ఓవర్లలో 143 పరుగులకే ఆలౌటైంది. తీక్షణ (3/23), హసరంగ (3/25), పతిరన (2/26) ప్రత్యర్థిని దెబ్బ తీశారు. హ్యారీ టెక్టార్ (40) టాప్‌స్కోరర్.

**ఐర్లాండ్ పోరాడినా..:** ఛేదనలో ఐర్లాండ్ 3 ఓవర్లకు 24/0తో శుభారంభం చేసింది. ఈ స్థితిలో స్టిర్లింగ్ (6) ఔటైనా.. మరో ఓపెనర్ అడైర్ పరుగుల వేట సాగించాడు. కానీ పవర్ ప్లే తర్వాత తీక్షణ, హసరంగ క్రమశిక్షణతో బౌలింగ్ చేయడంతో పరుగుల వేగం తగ్గింది. కుదురుకున్న రాస్ అడైర్ (34) ఔట్ కావడంతో ఐర్లాండ్‌కు ఎదురు దెబ్బ తగిలింది. ఈ స్థితిలో టెక్టార్, టకర్ (21) నిలిచారు. ఐర్లాండ్ 12 ఓవర్లకు 84/2తో కోలుకుంది. కానీ టకర్, టెక్టార్ వరుస ఓవర్లలో ఔట్ కావడంతో ఆ జట్టు మళ్లీ ఇబ్బందుల్లో పడింది. తీక్షణ, హసరంగ మూడు ఓవర్ల వ్యవధిలో 4 వికెట్లు పడగొట్టడంతో ఐర్లాండ్ పనైపోయింది. అంతకుముందు కుశాల్ మెండిస్, కమిందు మెండిస్ పోరాటంతో లంక గౌరవప్రదమైన స్కోరు సాధించింది. 16 ఓవర్లకు లంక 4 వికెట్లకు 104 పరుగులే చేసింది. ఆఖరి ఓవర్లలో కమిందు మెండిస్, కుశాల్ మెండిస్ దూకుడుగా ఆడడంతో లంక అనూహ్యమైన స్కోరును అందుకుంది. ఐర్లాండ్ ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేయడం ఆ జట్టుకు కలిసొచ్చింది.



# అఫ్గానిస్థాన్‌పై నెగ్గిన న్యూజిలాండ్




**చెన్నై:** టీ20 ప్రపంచకప్‌లో అఫ్గాన్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. 183 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 17.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆ జట్టులో టిమ్ సీఫెర్ట్ (65) అర్ధశతకం చేయగా, గ్లెన్ ఫిలిప్స్ (42), మార్క్ చాప్‌మన్ (28), డారిల్ మిచెల్ (25లి) రాణించారు. అఫ్గాన్ బౌలర్లలో ముజీబ్ రెహమాన్ 2, ఒమర్జాయ్, రషీద్ ఖాన్, మహమ్మద్ నబీ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. గుల్బాదిన్ నబీ(63) అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. సెదిఖుల్లా అటల్(29), రెహ్మానుల్లా గుర్బాజ్(27), దార్విస్ రసూలీ (20) ఫర్వాలేదనిపించారు. మూడో వికెట్‌కు అటల్, గుల్బదీన్ కలిసి 79 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. చివర్లో ఒమర్జాయ్(14) రనౌటయ్యాడు. న్యూజిలాండ్ బౌలర్లలో ఫెర్గుసన్ 2 వికెట్లు తీయగా.. హెన్రీ, డఫి, రవీంద్ర తలో వికెట్ పడగొట్టారు.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం · తెలుగు దిన పత్రిక



## ఒక రాత్రి బ్లాక్ డ్రెస్సులో..

'మిర్చి లాంటి కుర్రాడు' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన యంగ్ బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ మనందరికి సుపరిచితమే. ఆ తర్వాత మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సరసన 'కంచె' మూవీలో నటించి మంచి విజయం సాధించింది. దీంతో ఈ చిన్నదానికి వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా వచ్చిన అవకాశాలన్నింటిలో నటించి మెప్పించింది. మెయిన్‌గా బాలయ్యకు జోడిగా 'అఖండ' చిత్రంతో అఖండ విజయాన్ని సొంతం చేసుకుంది. అలాగే గత ఏడాది మరోసారి బాలకృష్ణ 'డాకు మహారాజ్' సినిమాతో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకుంది. ఇక ఈ సినిమా తర్వాత మరో ప్రాజెక్ట్ అనౌన్స్ చేయలేదు ఈ చిన్నది. కానీ నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటుంది. ఎప్పుడూ వేకేషన్స్, ఫ్రెండ్స్‌తో పార్టీస్ చేసుకుంటూ ఫుల్ ఎంజాయ్ చేస్తుంది. అలాగే అదిరిపోయే అవుట్ ఫిట్స్‌లో ఫొటోస్‌ను షేర్ చేస్తూ యూత్‌ను ఆకర్షిస్తోంది. అయినప్పటికీ ఆఫర్లు మాత్రం రావట్లేదు. దీంతో సోషల్ మీడియాలో మరింతగా రెచ్చిపోతుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా ప్రగ్యా తన ఇన్‌స్టాలో కొన్ని పిక్స్ షేర్ చేసింది. బ్లాక్ డ్రెస్సులో తెల్లటి తొడలతో పాటు ఎద అందాలు కనిపించేలా హాట్ షో చేసింది. ఇక వీటికి 'ఒక రాత్రి బ్లాక్ డ్రెస్సులో' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక వీటిని చూసిన నెటిజన్లు ఛీ ఛీ అవకాశాల కోసం మరీ ఇంతలా దిగజారాలా, అదేం చండాలమైన డ్రెస్ అని, కొంచెం పద్ధతిగా ఉండొచ్చు కదా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈ అమ్మడు బోల్డ్ ఫొటోస్‌ను మీరు కూడా ఓ సారి చూసేయండి.



## మేము ట్రిప్పులకు వెళ్తే సమస్య ఏంటో?

టాలీవుడ్ సీనియర్ నటి సురేఖావాణి గారాల పట్టి సుప్రిత, వెండితెరపైకి అడుగుపెట్టక ముందే సోషల్ మీడియాలో స్టార్‌గా ఎదిగింది. తన గ్లామరస్ ఫొటోలు, స్టైలిష్ వీడియోలతో నిత్యం నెటిజన్లను ఆకట్టుకునే ఈ భామ, త్వరలోనే హీరోయిన్‌గా ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతోంది. అయితే, ఒకవైపు అభిమానం వెల్లువెత్తుతున్నా, మరోవైపు ఆమెపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ కూడా అదే స్థాయిలో జరుగుతోంది. ముఖ్యంగా ఆమె ధరించే దుస్తులు, తల్లితో కలిసి వెళ్లే వెకేషన్స్‌పై కొందరు నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా.. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సుప్రిత, తనపై వస్తున్న ఈ విమర్శలపై అత్యంత ఘాటుగా స్పందించింది. ట్రోలర్లకు గట్టి కౌంటర్ ఇస్తూ తనలోని ఆవేదనను బయటపెట్టింది. "నేను నా కష్టార్జితంతో సంపాదించిన డబ్బులతో మా అమ్మను వెకేషన్స్‌కు తీసుకెళ్తున్నాను. నా తల్లిని సంతోషంగా ఉంచడానికి నేను ప్రయత్నిస్తుంటే, కొందరు ఎందుకు అంత కుళ్లు చూపిస్తున్నారు అర్థం కావడం లేదు. మేము ట్రిప్పులకు వెళ్తే ట్రోల్ చేసే వారికి అసలు సమస్య ఏంటో తెలియట్లేదు. డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయని అడుగుతారు. నేను ఐటీ రిటర్న్ కూడా వేస్తాను. మేము వెళ్లి లక్షలు లక్షలు ఖర్చుపెట్టము. సంపాదించిన దాంట్లోనే కొంత వెకేషన్లకు ఖర్చుపెడతాం. చాలామంది ట్రిప్పులకు వెళ్తారు కానీ మా మీదనే అందరి ఫోకస్ ఉంటుంది. అలాంటి కామెంట్లు చూసి చాలా ఏడ్చాను. కాళీగా కూర్చొని కామెంట్లు చేసేవాళ్లకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. నేను పని చేసుకోవాలి కాబట్టి పట్టించుకోను" అంటూ ఫైర్ అయింది. తమ వ్యక్తిగత జీవితంపై అనవసరంగా కామెంట్స్ చేసే వారికి ఇకపై ఉపేక్షించేది లేదని సుప్రిత స్పష్టం చేసింది. ఒక ఆడపిల్ల తన తల్లిని విదేశాలకు తీసుకెళ్లి సరదాగా గడపడం తప్పా అని ఆమె నిలదీసింది. ప్రస్తుతం సుప్రిత చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



## ఉస్తాద్ భగత్ సింగ్‌తో కమ్ బ్యాక్

ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంతో మంచి కమ్ బ్యాక్ ఇవ్వడానికి సిద్ధం అవుతోంది శ్రీలీల. 'పెళ్లి సందడి' చిత్రంతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈ యంగ్ బ్యూటీ.. మొదటి మూవీతోనే సూపర్ హిట్ సక్సెస్ అందుకుని టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెండ్ హీరోయిన్‌గా మారిపోయింది. దీంతో వరుస ఆఫర్లు అందుకుంటూ బ్యాక్ టు బ్యాక్ మూవీలు చేసింది. అయితే గత కొద్ది కాలంగా శ్రీలీల చేసిన సినిమా వరుస పరాజయాలు ఎదుర్కొవడంతో ఫ్యాన్స్ నిరాశ వ్యక్తం చేస్తున్నారు. కానీ ఈసారి మాత్రం ఈ యంగ్ బ్యూటీ మంచి కమ్ బ్యాక్ ఇవ్వనున్నట్లు మాట్లాడుకుంటున్నారు సినీ వర్గాలు. శ్రీలీల నటిస్తున్న తాజా చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. పవర్‌స్టార్ పవన్ కల్యాణ్, డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషనల్‌లో వస్తున్న ఈ హైఓల్టెడ్ మూవీపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇందులో శ్రీలీల, రాశిఖన్నా హీరోయిన్లుగా నటిస్తుండగా.. బలమైన ప్రమోషన్లు అండ్ బ్లాక్ బస్టర్ అంచనాలతో బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లకు సిద్ధంగా ఉంది. దీంతో ఇది శ్రీలీలకి కెరీర్‌ని మార్చే అవకాశం కావచ్చని అభిమానులు నమ్ముతున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com